క్లుప్తంగా

సౌత్ జోన్ సైక్లింగ్ పోటీలకు ఎంపిక



విద్యార్థినులతో హెచ్‌ఎం జ్యోతి, పీడీ

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గౌరవెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 12మంది విద్యార్థులు సౌత్‌జోన్ సైక్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో నిజామాబాద్ జిల్లాలో జరిగే ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ రోడ్‌రేస్ సైక్లింగ్ పోటీల్లో పాల్గొనున్నట్లు హెచ్‌ఎం జ్యోతి, వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటనర్సయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ విద్యార్థులు ఎంపిక కావడంపై ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఖేలో ఇండియా సౌత్ జోన్ ఉమెన్స్ లీగ్ రోడ్ సైకిల్ పోటీల పరిశీలకులుగా సిద్దిపేట జిల్లాకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు బండారుపల్లి శ్రీనివాసులు, జంగపల్లి వెంకటనర్సయ్య నియమితులయ్యారు. వారి ఎంపికపై క్రీడా సంఘాలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల రీ సర్వే



వివరాలు సేకరిస్తున్న రెవెన్యూ అధికారులు

దుబ్బాకరూరల్: డబుల్ బెడ్రూం ఇళ్లు అనర్హులకు పంపిణీ చేశారని గ్రామస్తులు ఆందోళనకు దిగడంతో మండలంలోని బల్వంతాపూర్‌లో డబుల్ బెడ్రూం ఇళ్ల వివరాలను రెవెన్యూ అధికారులు రీ సర్వే నిర్వహించారు. అనర్హులు నివాసం ఉంటున్నారని ప్రజలు 11న కలెక్టర్ మనుచౌదరికి వినతి పత్రం అందజేశారు. భూములు, ఇళ్లు, ఆస్తులు ఉన్నావారికే ఇళ్లు కేటాయించారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి అర్హులకే అందజేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్ సందీప్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో డబుల్ బెడ్రూం ఇళ్లను గురువారం రీ సర్వే చేశారు. నివాసముంటున్న వారి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ అనర్హులను తొలగించి అర్హులకే ఇళ్లు అందజేస్తామన్నారు.

18క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యంతో పోలీసులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ఆకునూరు గ్రామంలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 18క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్ ఫోర్స్, చేర్యాల పోలీసులు పట్టుకున్నట్లు ఎస్‌ఐ పి.నీరేశ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని ఆకునూరు గ్రామానికి చెందిన బి.తిరుపతి ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉంచినట్లు వచ్చిన సమాచారం మేరకు బుధవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ తో కలిసి బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు.

తక్కువ ఖర్చుతో కార్గో సేవలు



కార్గో సేవలను ప్రారంభిస్తున్న పవన్

కొండపాక(గజ్వేల్): ఆర్టీసీ బస్సుల్లో తక్కువ ఖర్చులతో కార్గో సేవలను అందుబాటులోకి తెచ్చామని డిపో మేనేజర్ పవన్ పేర్కొన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా గురువారం కార్గో సేవలను గజ్వేల్–ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులలో వేగంగా పార్శిల్స్‌ను రవాణా చేస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సందీప్, షఫీ, పాషా, భాస్కర్, శంకర్, అరవింద్, స్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రేణుక

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తొడబోయిన రేణుక నియామకం అయ్యారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడకు తూముకుంట నర్సారెడ్డి గురువారం ఆమెకు నియామక పత్రం అందజేశారు. రేణుక మాట్లాడుతూ జిల్లాలో పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు.

చైల్డ్ కార్డియాక్ ఆస్పత్రి సిద్ధం

- రేపు ప్రారభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- ఏర్పాట్లు పూర్తిచేసిన నిర్వాహకులు



త్వరలో ప్రారంభం కానున్న భవనం

కొండపాక(గజ్వేల్): సిద్దిపేట జిల్లా కొండపాక శివారులో ఆనంద నిలయం సమీపంలో చిన్న పిల్లలకు పుట్టుకతో అవసరపడే గుండె శస్త్రచికిత్సల నిర్వహణ ఆసుపత్రి ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. సత్యసాయి సేవా సంస్థ సహకారంతో నిర్మితమైన సత్యసాయి సంజీవని చైల్డ్ కార్డియాక్ ఆసుపత్రిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. అధికారులు అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దేశ విదేశాల్లో పేద ప్రజలకు విద్య, వైద్య సేవలు అందిస్తున్నట్లుగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు ఆసుపత్రి సేవలు ఉపయోగపడేలా వేసలుబాటును కల్పించారు.

రూ.50కోట్ల వ్యయంతో..

ఎర్రెనగుట్టపై ప్రశాంత వాతావరణంలో 5ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.50కోట్ల వ్యయంతో ఆసుపత్రిని నిర్మించారు. అధునాతన విధానంతో 100పడకల వసతితో పాటు రోజుకు 10మందికి పైగా పిల్లలకు ఆపరేషన్లు జరిగేలా సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

దేశంలో నాలుగోది..

తెలంగాణకు సెంటర్ పాయింట్‌గా ఉన్న సిద్దిపేట ప్రాంతంలో ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని సేవా సంస్థ ప్రతినిధులు నిర్ణయించుకున్నారు. విద్య వైద్యం ఉచితంగా అందించాలన్న ప్రధాన లక్ష్యంతో కొండపాకలోని ఆనంద నిలయం ట్రస్టు ఆవరణలోని 12ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసి మొదటగా ఏడెకరాల స్థలంలో సత్యసాయి విద్యా సంస్థను ఏర్పాటు చేశారు. బాలికలకు ఇంటర్మీడియెట్ విద్య నుంచి డిగ్రీ వరకు హాస్టల్ వసతితో పాటు పూర్తిగా ఉచితంగా విద్యను అందజేస్తుంది.

వసతులు

ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్, క్యాతలాబ్ ఈకో పరికరాలతో పాటు ప్రత్యేకంగా ఓపీడీ భవనం ఏర్పాటైంది. ఆసుపత్రిలో సర్జికల్ టీం, క్రిటికల్ కేర్ యూనిట్‌లను, అలాగే పేషెంట్‌తో పాటు మరో ఇద్దరు ఉండే సౌకర్యం, భోజన వసతులను కల్పించేలా చర్యలు తీసుకున్నారు.

ప్రముఖుల రాక

ఆసుపత్రి ప్రారంభానికి సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, సద్గురు మధుసూదనసాయితోపాటు మరి కొందరు ప్రముఖులు హాజరవుతారని సేవా సంస్థ ట్రస్టు పేర్కొంది.

తెలుగు రాష్ట్రాల్లో మొదటిది..

చాలా మంది పేద కుటుంబాల పిల్లలు పుట్టుకతో గుండె సంబంధిత వ్యాధితో పుట్టడంతో కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకునే స్తోమత లేక మృత్యువాత పడుతున్నారు. అలా జరుగకుండా భవిష్యత్ తరాలను కాపాడాలన్న సంకల్పంతో అధునాతన పరికరాలతో ఆసుపత్రిని నిర్మించారు. దేశ వ్యాప్తంగా రాయపూర్, పల్వార్, ముంబైలోను ఉన్నాయి. ఇక్కడి ఆసుపత్రి సేవలను త్వరలోనే ప్రారంభించడానికి ఏర్పాట్లు పూర్తిచేశారు.

నీరుగారుతున్న 'లక్ష్యం'



లింగారెడ్డి పల్లిలో వృథాగా పడివున్న మొక్కలు

దుబ్బాకటౌన్: రాష్ట్రాన్ని హరిత తెలంగాణగా మార్చడానికి గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం హరిత హారం పేరుతో పల్లెలు, పట్టణాల్లో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించింది. కానీ కొంత మంది అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారి పోతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాయపోల్ మండలం లింగారెడ్డి పల్లిలో విశ్వనాథ చెరువు కట్టపై రెండు వైపులా మొక్కలు నాటడానికి మొక్కలను తీసుకువచ్చారు. మొక్కలను తెచ్చి చాలా రోజులు గడుస్తున్నా నాటకుండా పక్కన పడేశారు. వందల మొక్కలు చెరువు కట్టపై వృథాగా దర్శనమిస్తున్నాయి. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఏచూరి మృతి ఉద్యమాలకు తీరనిలోటు



గజ్వేల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్/కొమురవెల్లి(సిద్దిపేట)/బెజ్జంకి(సిద్దిపేట)/సిద్దిపేటఅర్బన్: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరనిలోటని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు సందబోయిన ఎల్లయ్య పేర్కొన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి గురువారం పూలమాలవాళుల వేసి నిర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యావంతుడు, ఎస్‌ఎఫ్‌ఐ నుంచి పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎదిగిన ఏచూరి రాజ్యసభకు రెండు సార్లు ఎన్నికవడంతో పాటు భారత పార్లమెంటు బృందానికి నాయకత్వం వహించి ఐక్యరాజ్య సమితిలో మూడుసార్లు ప్రసంగించారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు వెంకటచారి, అఫ్జల్, సమీర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కొమురవెల్లి పార్టీ కార్యాలయంలో ఏచూరి చిత్రపటానికి సీపీఎం నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. జిల్లా కమిటీ సభ్యురాలు శారద మాట్లాడారు. తాడూరి రవీందర్, తేలు ఇస్తారి, తాడూరి మల్లేశం, రవీందర్ తదితరులు పాల్గొన్నారు. సీతారాం ఏచూరి మృతిపై మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బెజ్జంకిలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న నాయకుడని కొనియాడారు. మార్క్సిస్టు మేధావి సీతారాం ఏచూరి మరణం ఉద్యమానికి, ప్రజాపోరాటాలకు తీరనిలోటని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శశిధర్, సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సంతాప సభలో వారు ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రవికుమార్, శిరీష, ప్రశాంత్, సంజీవ్ పాల్గొన్నారు.

అక్రమ వెంచర్ ప్రహరీ తొలగింపు



జేసీబీ సహాయంతో గోడను కూల్చివేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

సిద్దిపేటఅర్బన్: అర్బన్ మండలం పొన్నాల ఊరచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో వెలిసిన అక్రమ వెంచర్ ప్రహరీని గురువారం సుడా అధికారులు కూల్చివేశారు. 'ఆక్రమణల నిగ్గు తేలేనా' అనే శీర్షికతో సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి సుడా వైస్ చైర్మన్ ఆశ్రిత్ కుమార్ స్పందించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని అక్రమ వెంచర్‌ల హద్దు రాళ్లను తొలగించాలని సుడా టీపీఓ దేవరాజ్‌కు సూచించడంతో గురువారం ఆ అక్రమ వెంచర్ గోడను అధికారులు కూల్చివేశారు. అదే విధంగా నాంచారుపల్లిలోని అక్రమ వెంచర్ హద్దు రాళ్లను తొలగించారు. టీపీవో దేవరాజ్ మాట్లాడుతూ సుడా పరిధిలోని బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని, అక్రమంగా వెంచర్‌లు వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నూతనంగా నిర్మిస్తున్న గృహ యజమానులు తప్పనిసరిగా అనుమతులు తీసుకొని, నిబంధనలకు అనుగుణంగా నిర్మించుకోవాలని సూచించారు.

పేకాట స్థావరంపై దాడులు
– ఐదుగురు అరెస్టు



నిందితులతో పోలీసులు

గజ్వేల్‌రూరల్: పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్, గజ్వేల్ పోలీసులు దాడులుచేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్న ఘటన గురువారం సంగుపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సంగుపల్లి శివారులోని కురుమ భవనంలో కొందరు పేకాట ఆడుతున్నారని వచ్చిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు దాడిచేసి ఐదుగురిని అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి వద్దనుంచి రూ.5100 నగదు, 5సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పేకాట, జూదం ఆడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అధికారులకు నోటీసులు

సిద్దిపేటజోన్: జిల్లా రెవెన్యూ అధికారి పేరిట మున్సిపల్ కమిషనర్, పీఐఓ (ప్రజా సంబంధాల అధికారి)తో పాటు ఆర్టీఐ కార్యకర్త షాదుల్‌కు నోటీసులు జారీ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో పని చేసే అధికారి విషయంలో షాదుల్ ఆరోపణలతో ఆర్టీఐ కింద దరఖాస్తు చేసుకున్నారు. వాటి ఆధారంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 21న సంబంధించిన పూర్తి పత్రాలతో హాజరుకావాలని, మున్సిపల్ కమిషనర్, పీఐఓ, ఫిర్యాదు దారుడు షాదుల్‌కు నోటీసులు జారీ చేశారు.

చరిత్రలో నిలిచిన సాయుధ పోరాటం

- ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బాస్



మాట్లాడుతున్న అబ్బాస్

దుబ్బాక: వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ప్రపంచ చరిత్రలోనే గొప్పదిగా నిలిచిపోయిందని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ.అబ్బాస్ అన్నారు. దుబ్బాకలో గురువారం సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్ అధ్యక్షతన తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అబ్బాస్ మాట్లాడుతూ.. 1946–51 మధ్యకాలంలో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో నైజాం, రజాకార్లు, దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా రైతుల పోరాటం జరిగిందన్నారు. భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన ఈ పోరాటంలో 4500 మందికి పైగా అమరులు అయ్యారని చెప్పారు. పల్లెలను భూస్వాములు, రజాకార్ల నుంచి విముక్తి చేసి 10లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన గొప్ప పోరాటం అని చెప్పారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, సీఐటీయూ జిల్లా నేత గోపాలస్వామి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు నవీన, సాజిద్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి: బీజేపీ



ఫ్లెక్సీని దహనం చేస్తున్న నేతలు

సిద్దిపేటకమాన్: విదేశాల్లో రాహుల్‌గాంధీ నిర్వహించిన సమావేశాల్లో భారత దేశంపై వ్యతిరేక వ్యాఖ్యలు చేశారని, ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరేశ్ డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీ వ్యాఖ్యలను నిరసిస్తూ స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ఆ పార్టీ నేతలు రాహుల్ గాంధీ ఫ్లెక్సీని గురువారం దహనం చేశారు. కార్యక్రమంలో వెంకట్, కార్తీక్, ఎల్లం, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన



నాటక ప్రదర్శనలో సాధన శూరులు

గజ్వేల్‌రూరల్: వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సాధన శూరుల నాటక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. పట్టణంలోని ఢిల్లీవాలా హోటల్ సమీపంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితిని పురస్కరించుకొని బొజ్జ గణపయ్యను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా గురువారం రాత్రి సాధన శూరుల నాటకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో పద్మశాలి, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలు అవసరం

- డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేటరూరల్: విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని జడ్పీహెచ్‌ఎస్ రాఘవాపూర్ పాఠశాలలో గురువారం ఎస్‌జీఎఫ్ మండల స్థాయి పాఠశాలల క్రీడలు నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలని, బాగా ఆడి జిల్లా స్థాయిలో రాణించాలని సూచించారు. ఈ పోటీల్లో మొదటిరోజు బాలుర అండర్ 14, అండర్ 17విభాగంలో పది పాఠశాల నుండి 450 మంది విద్యార్థులు, 30 మంది అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి రాజిరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు మంజు భార్గవి, మండల ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ ఎర్వ అశోక్, శ్రీశైలం సుశీల, వెంకటస్వామి, నవీన్, శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు వేణు, సాగర్, లీలానంద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల స్థాయి నుంచే రాణించాలి

కొండపాక(గజ్వేల్): పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు సూచించారు. కొండపాకలోని వేదా ఇంటర్నేషనల్ పాఠశాలలో ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో అండర్ 14, 17 విభాగం విద్యార్థులకు క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంఎన్‌ఓ విఠల్, కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్లు భాస్కర్‌రెడ్డి, ఉప్పలయ్య, ఎంఐఎస్ సురేందర్, సీఆర్పీ బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

టెండర్ ప్రక్రియలోనే ఆగిన పనులు



మహాచండీ విగ్రహం


హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్‌లో నిర్మిస్తున్న మహాచండీ ఆలయ నిర్మాణ పనులు టెండర్ ప్రక్రియలోనే నిలిచిపోయినట్లు మాజీ సర్పంచ్ సంపత్ గురువారం తెలిపారు. బయన్న గుట్టలపై నుంచి గ్రామస్తులు ఆ విగ్రహాన్ని తెచ్చి పంచాయతీ గదిలో ఉంచారు. గ్రామంలో ఆలయం నిర్మించి ప్రతిష్ఠించాలని వారు పదేళ్లుగా ప్రయత్నం చేస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేకు విషయం వివరించడంతో ఆలయ నిర్మాణానికి రెవెన్యూ అధికారులు స్థలం కూడా కేటాయించారు. దీనిని దేవాదాయశాఖకు రిజిస్ట్రేషన్ చేయడంతో వారు ఆలయ నిర్మాణానికి రూ.38లక్షలు నిధులు మంజూరుచేసి అనుమతులు ఇచ్చారు. గ్రామస్తులు పనులు చేయడానికి రూ.10లక్షలు డిపాజిట్ చేయాలని నిబంధన పెట్టడంతో పనులు టెండర్ ప్రక్రియలోనే ఆగిపోయాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ చొరువ తీసుకొని టెండర్ ప్రక్రియను పూర్తి చేయించాలని గ్రామస్తులు కోరారు.

గణపతి బప్పామోరియా..

పలుచోట్ల ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను గురువారం ఉత్సాహంగా నిమజ్జనాలకు తరలించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గణపతి బప్పామోరియా.. అంటూ సాగారు.



గజ్వేల్‌రూరల్: వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకువెళ్తున్న విద్యార్థులు



దుబ్బాకలో పాల్గొన్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, కత్తి కార్తీక, రవీందర్‌రెడ్డి, రాజమౌళి తదితరులు

సంక్షిప్త వార్తలు

◆ **మాజీ మంత్రి హరీశ్‌రావు పరామర్శ**

సిద్దిపేటకమాన్/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట పట్టణం ఒకటో వార్డు లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన హైకోర్టు న్యాయవాది వంగ హన్మంతరెడ్డి తల్లి రాజవ్వ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు గురువారం పరామర్శించారు. అనంతరం ప్రశాంత్‌నగర్‌లో పాస్టర్ మత్తాయి భార్య సువార్త మృతి చెందడంతో వాళ్ల ఇంటికి వెళ్లి ఆమె మృతదేహానికి ఆయన నివాళి అర్పించారు.

◆ **తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చాలి**

సిద్దిపేటఎడ్యుకేషన్: ఉత్తమ విద్యను అభ్యసిస్తూ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకుని తల్లిదండ్రుల ఆశలను విద్యార్థులు నెరవేర్చాలని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత పిలుపునిచ్చారు. కామర్స్ విభాగం ఆధ్వర్యంలో కళాశాల సౌకర్యాలు, బోధన పద్ధతులు, కామర్స్‌తో ఉపయోగాలు తదితర అంశాలపై గురువారం నూతన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె ఏ ప్లస్ న్యాక్‌గ్రేడ్‌గా గుర్తించిన ఉన్నతమైన కళాశాలలో చేరినందుకు విద్యార్థులను అభినందించారు. కామర్స్ విభాగాధిపతి గోపాల సుదర్శనం, పీజీ కోఆర్డినేటర్ అయోధ్యరెడ్డి, మధుసూదన్, సులేమాన్ ప్రసంగించారు. భవాని, ఉమామహేశ్వరి, సంపత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **నిమజ్జనం ఏర్పాట్ల పరిశీలన**

హుస్నాబాద్: ఎల్లమ్మ చెరువు వద్ద గణేశ్ విగ్రహాలు నిమజ్జనంచేసే ప్రదేశాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత గురువారం పరిశీలించారు. అలాగే ఎల్లమ్మ చెరువు మత్తడి సమీపంలో నిర్వహిస్తున్న ఎఫ్‌ఎస్‌టీపీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిమజ్జనం చేసేటప్పుడు ప్రజలకు ఇబ్బంది పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు లావణ్య సది, రాజు, ఏఈ పృథ్వి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

◆ **సంప్రదాయ బద్ధంగా జరుపుకోవాలి**

హుస్నాబాద్: వినాయక నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో, సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని ఏసీపీ సతీశ్ పిలుపునిచ్చారు. నిమజ్జనం కోసం ఉపయోగించే వాహనాలు మంచి కండిషన్‌లో ఉండేలా చూసుకోవాలని, ఊరేగింపు సమయంలో బాణాసంచా కాల్చవద్దని, డీజేలకు అనుమతి లేదని చెప్పారు. చెరువులు, కుంటల్లోకి దిగి ప్రమాదాలకు గురికావొద్దని సూచించారు.

◆ **డీజేలకు అనుమతి లేదు:సీఐ**

కొమురవెల్లి(సిద్దిపేట): గణేశ్ నిమజ్జనంలో డీజేలకు అనుమతి లేదని చేర్యాల సీఐ శ్రీను చెప్పారు. ఎస్‌ఐ రాజుగౌడ్‌తో కలసి మండలంలోని తపాస్‌పల్లి, పోసాన్‌పల్లి, అయినాపూర్, కొమురవెల్లి గ్రామాలలోని గణేశ్ మండపాలను, నిమజ్జనంచేసే చెరువులను గురువారం పరిశీలించారు. చెరువుల వద్ద గజ ఈతగాళ్లను ఉంచాలని ఆదేశించారు. నిర్వాహకులు, కార్యదర్శులకు పలు సూచనలు చేశారు.

◆ **సమస్యలపై పోరాడుతాం**

దుబ్బాకటౌన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ ఎల్లప్పుడు ముందుండి పోరాడుతుందని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆదరాస్‌పల్లి శశిధర్ శర్మ చెప్పారు. రాయపోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ సర్వసభ్య సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఎస్జీటీలకు తీవ్ర నష్టం జరుగుతుందని వారి సమస్యలపై పోరాడుతామని చెప్పారు. ముత్యం రెడ్డి, రాజమహేందర్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, సుధాకర్, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **డీఏలు వెంటనే మంజూరు చేయండి**

బెజ్జంకి(సిద్దిపేట): ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన డీఏలను వెంటనే మంజూరు చేయాలని ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాడ శ్రీధర్ డిమాండ్ చేశారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాల్లో గురువారం ఆయన పర్యటించి సభ్యత్వ నమోదు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రవీందర్, సతీష్ కుమార్, రాములు, శ్రీనివాస్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **మున్సిపల్ కమిషనర్ వాస్తవాలు చెప్పాలి**

హుస్నాబాద్: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మున్సిపాలిటీ ప్రత్యేక డ్రైనేజీ నిర్మిస్తుందా? లేదా అనేది అంశాన్ని మున్సిపల్ కమిషనర్ చెప్పాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్ గౌడ్ కోరారు. సెట్ బ్యాక్ ఎంత వరకు కావాలో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

◆ **సభ్యత్వ నమోదుకు అపూర్వ స్పందన**

బెజ్జంకి(సిద్దిపేట)/అక్కన్నపేట(హుస్నాబాద్)/తొగుట(దుబ్బాక): బీజేపీ జాతీయ స్థాయిలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి అపూర్వ స్పందన లభిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. బెజ్జంకి పార్టీ కార్యాలయం, అక్కన్నపేటలోని కట్కూర్, తొగుట మండల కేంద్రంలోను గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మహిపాల్‌రెడ్డి, అజయ్‌వర్మ, రామచంద్రం, రాజు తదితరులు పాల్గొన్నారు.